# ప్రభుత్వ భూముల్లో షెడ్లు

- నర్సింగాపూర్ శివారులో వేలాది వెలసిన గుడారాలు
- ఇండ్ల పట్టాలు ఇప్పిస్తామన్న సీపీఎం నాయకుల ప్రకటనతో నిత్యం వందలాది మంది రాక
- అంతా మహిళా సంఘాల సభ్యులే
- వారితోనే పెద్ద గ్రూప్ ఏర్పాటు
- దరఖాస్తు ఇచ్చినవారికి షెడ్ వేసుకునే చాన్స్
- అధికారుల ఫిర్యాదు.. రంగంలోకి పోలీసులు
- బాధ్యులపై కేసు నమోదు
- పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించడమే మా లక్ష్యం : సీపీఎం నాయకులు
- నేడు ఐదు వేల మందితో ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్తామని స్పష్టం



నర్సింగాపూర్ శివారులో గుట్టబోరుకు ప్రజలు వేసుకొన్న షెడ్లు

జగిత్యాల, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ శివారు పరిధిలో 437/112/2 సర్వే నంబర్‌లో దాదాపు 220 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అయితే, ఈ సర్వే నంబర్‌తో పాటు మరికొన్ని సర్వే నంబర్లలో సైతం ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇవన్నీ గుట్ట బోర్లే. అయితే, కొద్ది నెలల క్రితం గుట్ట బోర్లను చదును చేసి, వాటిని ప్రభుత్వ కార్యకలాపాలతో పాటు, కొన్ని కార్యాలయాలకు ఇవ్వాలన్న ఆలోచనను ప్రభుత్వం చేసింది. ఈ క్రమంలో గుట్టబోర్లను చదును చేసే కార్యక్రమం ప్రారంభమైంది. విషయం తెలుసుకున్న వెంటనే సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ఇండ్ల పట్టాలు ఇప్పిస్తామని, ప్రజలు కలిసివచ్చి తమ తో పాటు ఉద్యమిస్తే ఇది సాధ్యమవుతుందని ప్రకటించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో ప్రాతినిధ్యం వహించి పేదలకు ఇండ్ల స్థలాన్ని ఇప్పించేలా చూస్తామని, అవసరమైతే పోరాటం చేస్తామన్నారు.

### అంతా మహిళా సంఘ సభ్యులే.. వేలకు చేరిన షెడ్లు

సీపీఎం నాయకుల ప్రకటనతో రెండు నెలల క్రితమే గ్రామ శివారులోని గుట్ట బోర్లకు షెడ్లు వేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఇండ్ల స్థలాలు వస్తాయన్న విషయం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాల సభ్యులకు క్రమంగా పాకిపోయింది. దీంతో పదుల సంఖ్యలో ప్రజలు నర్సింగాపూర్ శివారుకు రావడం మొదలైంది. వచ్చిన మహిళా సంఘ సభ్యుల్లో పదకొండు మందికి ఒక గ్రూప్ ఏర్పాటు చేశారు. ఇలా ఏర్పడ్డ పది గ్రూప్‌లతో ఒక పెద్ద గ్రూ ప్‌ను ఏర్పాటు చేశారు. 'ఆర్డీవో జగిత్యాల పేరిట' పేరు, తండ్రిపేరు, ఆధార్‌కార్డు, చిరునామా వివరాలు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు ఫారాలను రూపొందించి, మహిళా సంఘ సభ్యులకు అందజేశారు. అయితే, దరఖాస్తు ఫారాలు తీసుకొన్న మహిళలకు గుట్టబోరుకు షెడ్డు వేసుకొని, నివాసం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

### అక్కడే నివాసం.. పొద్దున, సాయంత్రం హాజరు

ఇండ్ల పట్టాల విషయం దావానంలా వ్యాపించడంతో 15 రోజుల వ్యవధిలోనే వేల సంఖ్యలో మహిళలు నర్సింగాపూర్‌కు శివారులోని ఈ స్థలానికి చేరుకున్నారు. ఇప్పటికీ వస్తూనే ఉన్నారు. అయితే, నిత్యం ఇక్కడే ఉండాలని, అవసరమైతే ప్రభుత్వంతోనూ, అధికారులతోనూ పోరాటం చేసేందుకు సిద్ధపడాలని సదరు నాయకులు తెలియజేయడంతో అక్కడే ఉంటున్నారు. ఇంకా షెడ్డు వేసుకోలేని వారు అవసరమైతే స్థలంలో చీరలు చుట్టాలని చెప్పడంతో, పెద్ద సంఖ్యలో చీరలు సైతం చుట్టారు. ముఖ్యంగా బెజ్జంకి, గుండి, గోపాల్‌రావుపేట, ధర్మారం, రామడుగు, సిరిసిల్ల, చందుర్తి ఇలా అనేక ప్రాంతాల నుంచి మహిళలు, ప్రజలు నర్సింగాపూర్ గుట్ట బోర్ల వద్దకు చేరుకొ ని ఇక్కడే 15 రోజులుగా ఉంటుండడం విశేషం. ఇక మహిళా గ్రూపుల సభ్యులు మొత్తం ఇక్కడే నివాసం ఉండాలని, పొద్దున, సాయం త్రం హాజరు తీసుకునేందుకు వీలుగా హాజరుపట్టి ఏర్పాటు చేయాలని చెబుతుండడంతో మహిళ సంఘాల వాళ్లు అటెండెన్స్ రిజిస్టర్‌ను మెయింటెన్ చేస్తున్నారు. రోజూ రెండుసార్లు హాజరు తీసుకుంటున్నారు.

### వెలిసిన హోటల్స్.. జిరాక్స్ సెంటర్లు

నర్సింగాపూర్ గుట్టబోరు ప్రాంతంలో జన సామర్థ్యం పెరగడంతో ఇక్కడే తాత్కాలిక హోటల్స్ వెలిశాయి. వాటితో పాటు జిరాక్స్ సెంటర్, ఫొటో స్టూడియోలతో పాటు, చిరుతిండ్లను అమ్మే దుకాణాలు తాత్కాలికంగా ఏర్పాటు చేసి, వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇంకా అటెండెన్స్ తీసుకుంటుండడంతో, అటెండెన్స్ రిజిస్టర్ బుక్కులు అమ్మే దుకాణాలు కూడా వెలువడం విశేషం.

### నేడు ఐదువేల మందితో కలెక్టరేట్‌కు ర్యాలీ తీస్తాం..

కాగా, ఈ విషయమై సీపీఎం నాయకులు మాట్లాడుతూ పేద ప్రజలకు కూడు, గూడు, గుడ్డ అత్యవసరాలని, నిరుపేదలకు కనీసం 120 గజాల ఇండ్ల స్థలాలు ఇప్పించడమే లక్ష్యంగా తమ కార్యాచరణ ఉంటుందంటున్నారు. నర్సింగాపూర్ శివారులో దాదాపు 800 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలన్న మంచి లక్ష్యంతో తాము ముందుకు వెళ్తున్నామన్నారు. రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ భూమిలో పట్టాలు ఇవ్వాలని కోరామని, వారి నుంచి సరైన సమాధానం లేదని వారు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లోనే ప్రజలు ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారని వివరించారు. దాదాపు ఐదువేల మందితో ర్యాలీగా సోమవారం జగిత్యాల కలెక్టరేట్‌కు వెళ్లి ప్రజావాణిలో దరఖాస్తు చేస్తామని చెప్పారు.

### కేసు నమోదు చేశాం : జగిత్యాల రూరల్ సీఐ

నర్సింగాపూర్ శివారులోని 437/112/2 సర్వే నంబర్ భూమి ప్రభుత్వానికి చెందినదని, ఆ భూమిలో చొరబడి, షెడ్లు వేసుకోవాలని సూచించిన వారిపై కేసు నమోదు చేశామని జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. నర్సింగాపూర్ ప్రభుత్వభూమిలో ప్రజలు షెడ్లు వేసుకునే విషయంలో తమకు జగిత్యాల రూరల్ తహసీల్దార్ ఫిర్యాదు చేశారని, ఈ క్రమంలో బాధ్యులైన కొందరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరో ఏదో చెప్పారని నమ్మి షెడ్లు వేసుకోవద్దని, ఆ ఆలోచనను విరమించుకోవాలని, లేదంటే షెడ్లు వేసుకున్నవారిపై సైతం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

# ట్రాక్టర్ ఢీకొని అన్నదమ్ములు మృతి

- మంథనిలో ఘోర రోడ్డు ప్రమాదం
- అత్తగారింటికి బైక్‌పై వెళ్తుండగా ఘటన



నవీన్, నాగరాజు(ఫైల్)

మంథని, డిసెంబర్ 17: ట్రాక్టర్ ఢీకొని ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందిన ఘటన మంథనిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మంథని పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన తాటి బాపు–రాధమ్మ దంపతులకు నలుగురు కుమారులు నాగరాజు, నరేశ్, నవీన్, నాగేంద్రబాపు ఉన్నారు. రాధమ్మ భర్త బాపు ఎనిమిదేండ్ల క్రితమే మృతి చెందాడు. పెద్ద కుమారుడు నాగరాజు(42), నవీన్(35) ఇద్దరు కూడా కారు డ్రైవర్లుగా పని చేస్తున్నారు. కాగా నవీన్ తన అత్తగారి ఊరైన రామగిరి మండలం బేగంపేటకు అన్న నాగరాజుతో కలిసి శనివారం రాత్రి బైక్‌పై బయలుదేరాడు. మంథని మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్‌పల్లి గ్రామ సమీపంలోని లక్కెపూర్ గ్రామ క్రాసింగ్ వద్ద మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై అక్కెపల్లి గ్రామం నుంచి వస్తున్న ట్రాక్టర్ వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న నాగరాజును ప్రభుత్వ దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆదివారం నాగరాజు, నవీన్ మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుల్లో నాగరాజుకు భార్య పుష్పలత, కూతురు రక్షిత(12), నవీన్‌కు భార్య సుజాత, కుమారులు ప్రియాన్స్(4), రియాన్స్(2) ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లి రాధమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.


# జాతీయస్థాయి జూడో పోటీల్లో తెలంగాణకు పతకాలు




పతకాలు సాధించిన రాష్ట్ర జట్టు క్రీడాకారులు

కొత్తపల్లి, డిసెంబర్ 17: కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో జరుగుతున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు పతకాల పంట పండించినట్లు తెలంగాణ జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన పెద్దపెల్లి జిల్లా జూడో సంఘం కార్యదర్శి సిలివేరి మహేందర్ తెలిపారు. పలు విభాగాల్లో అద్వితీయ ప్రతిభ కనబరిచిన బాలురు పతకాలను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. 35 కేజీల విభాగంలో ప్రవీణ్‌కుమార్ రజత పతకం సాధించగా, 30 కేజీల విభాగంలో శివ, 50 కేజీల విభాగంలో జంపయ్య పతకాలను సాధించినట్లు తెలిపారు. క్రీడాకారులు పతకాలు సాధించడంపై తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, భారత జూడో సమాఖ్య కోశాధికారి కైలాసం యాదవ్, తెలంగాణ రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షులు కడారి అనంతరెడ్డి, అజీజ్, కోశాధికారి బాలరాజు, పెద్దపెల్లి జిల్లా జూడో సంఘం చైర్మన్ మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, అధ్యక్షుడు సంజీవ్, గురుకుల సంస్థల జూడో కోచ్‌లు సీహెచ్ రాము, నాగరాజు, ఆదిలాబాద్, కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల కోచ్‌లు రాజు, సాయిరాం యాదవ్‌తో పాటు లింగమూర్తి, మహమ్మద్ అబ్దుల్ బారి హర్షం వ్యక్తం చేశారు.

# భార్య కాపురానికి రావడం లేదని విద్యుత్ టవర్ ఎక్కిన భర్త



విద్యుత్ టవర్‌ఎక్కిన ప్రభాకర్

వెల్గటూర్, డిసెంబర్17: తన భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి విద్యుత్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. పోలీసులు ఆ వ్యక్తికి నచ్చజెప్పి కిందికి దించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. ఎండపెల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన మేకల ప్రభాకర్‌కు చొప్పదండి మండలం ఆర్నకొండకు చెందిన లావణ్యతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొంత కాలం వీరి కాపురం సజావుగానే సాగింది. వీరికి ఇద్దరు కుమారులు. అయితే ప్రభాకర్ కొంతకాలంగా లావణ్యను శారీరకంగా, మానసికంగా హింసిస్తుండడంతో పలుమార్లు లావణ్య పిల్లలతో సహా తల్లిగారింటికి వెళ్లింది. అప్పుడు కూడా ఓసారి ప్రభాకర్ ఇలాగే సెల్ టవర్ ఎక్కాడు. దీంతో పెద్దలు కలుగజేసుకొని ఇద్దరికీ నచ్చజెప్పి లావణ్యను కాపురానికి తీసుకొచ్చారు. అయినప్పటికీ ప్రభాకర్ తన పద్ధతి మార్చుకోకపోవడంతో లావణ్య రెండు మాసాల క్రితం తన పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లింది. కాగా ఆదివారం ప్రభాకర్ మళ్లీ గ్రామంలో ఉన్న విద్యుత్ టవర్ ఎక్కాడు. తన భార్యను కాపురానికి తీసుకురావాలని లేదంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రభాకర్‌కు నచ్చజెప్పి కిందికి దించారు. భార్యాభర్తలిద్దరికీ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474

REAL ESTATE

★ రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడి పెట్టడం ద్వారా ప్రతిరోజు ఆదాయం పొందే అవకాశం. యాదగిరిగుట్టలో లగ్జరీ సూట్ ప్లాట్స్ కేవలం 26 లక్షలకే లాంచింగ్ ఆఫర్లో కలవు. సంప్ర|| సెల్: 9381128358
NTK-316690

CHANGE OF NAME

★ I, Tabassum W/o. Avez Mohammed R/o. H.No. 3-8-56/3, Shanthi Nagar, Sircilla, Rajanna Sircilla, TS. have changed my name as Tabassum Fatima W/o. Avez Mohammed
NT-324472

★ I, PUNDRA SRAVANI R/o. 4-86, KOMATIKONDAPUR, IBRAHIMPATNAM, JAGITYAL, TS. Changed After Marriage My Name As KORIPELLY SRAVANI W/o. KORIPELLY PRADEEP REDDY.
NT-324469

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194